క్లుప్తంగా

ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి



బయ్యారం: లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని కోరుతూ ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని కొత్తపేట నుంచి బయ్యారం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ వర్సా ప్రకాశ్, నాయకులు రామకృష్ణ, అరుణ్‌కుమార్, కృష్ణ, రాజేష్, శివకుమార్, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

కాల్వలో పడి మేకల కాపరి మృతి



కృష్ణయ్య (ఫైల్)

దంతాలపల్లి: మేకలను మేపడానికి వెళ్లి ప్రమాదవశాత్తు మేకలకాపరి ఎస్సారెస్పీ కాల్వలో పడి మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన దూరు కృష్ణయ్య(45) మేకలను పెంచుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలోనే శనివారం మేకలను మేపుతుండగా ప్రమాదవశాత్తు గ్రామ శివారులోని ఎస్సారెస్పీ కాల్వలో పడి మృతిచెందాడు. మృతుడి కుమారుడు అనిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పిల్లల రాజు తెలిపారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడి..

కురవి: మండలంలోని పెద్దలాల్‌తండా జీపీ పరిధిలోని కుమ్మరిబోడు తండాకు చెందిన బానోత్ హమ్యా(70) గత శుక్రవారం రాత్రి రోడ్డుపై నడుచుకుంటు వెళ్తున్నాడు. గుంజ నరేష్ అనే వ్యక్తి స్కూటీపై వస్తూ వృద్ధుడిని ఢీకొట్టాడు. ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై సంతోష్ శనివారం తెలిపారు. మృతుడి కుమారుడు కిషన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నేలవాలిన మొక్కజొన్న



కొత్తగూడ: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న అధిక వర్షాలు రైతులను నట్టేట ముంచుతున్నాయి. వారం రోజులుగా ప్రతీ రోజు కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో మొక్కజొన్న నేలవాలాయి. వర్షాల కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

అన్నిరంగాల్లో రాణించాలి

కొత్తగూడ: యువత అన్నిరంగాల్లో రాణించాలని ఎస్సై రాజ్‌కుమార్ అన్నారు. కార్లాయి యువజన సంఘానికి శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వాలీబాల్ కిట్ అందజేశారు.

ఆర్డీఓ కార్యాలయంలో రిజర్వేషన్ కోలాహలం

మహబూబాబాద్: మానుకోట ఆర్డీఓ కార్యాలయంలో శనివారం మానుకోట, డోర్నకల్, బయ్యారం, గార్ల, గూడూరు, కొత్తగూడ గంగారం, కురవి, కేసముద్రం, ఇనుగుర్తి, సీరోల్ మండలాలకు సంబంధించిన సర్పంచ్‌ల, ఎంపీటీసీల రిజర్వేషన్ ప్రక్రియ శనివారం పూర్తి చేశారు. మానుకోట డివిజన్ పరిధిలో 11మండలాలు ఉండగా ఆర్డీఓ కృష్ణవేణి సంబంధిత అధికారులు పలు రాజకీయ పార్టీల నాయకులు మార్నేని వెంకన్న గద్దం అశోక్, సురేష్, ఖాసీం తదితరులు పాల్గొని, వారి సమక్షంలో రిజర్వేషన్లు ఖరారు చేశారు. కాని రాత్రి 9గంటల వరకు రిజర్వేషన్‌ల జాబితాను ప్రకటించలేదు. కలెక్టర్ కార్యాలయానికి పంపినట్లు అధికారులు పేర్కొన్నారు. కలెక్టర్ కార్యాలయం నుంచే అధికారికంగా ప్రకటించాలి, తాము చేయాల్సిన పని పూర్తి చేశామని అధికారులు చెబుతున్నారు.

ఫౌంటెయిన్లలో మురుగునీటి నిల్వ

డోర్నకల్: మున్సిపాలిటీ సుందరీకరణలో భాగంగా పట్టణంలోని రెండు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఫౌంటెయిన్లు మురుగు నీటి నిల్వలతో దుర్వాసన వెదజల్లుతున్నాయి. బైపాస్ రోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద, అమ్మపాలెం క్రాస్ రోడ్డులోని జగ్జీవన్‌రాం విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన ఫౌంటెయిన్లు చాలా కాలం క్రితం మరమ్మతులకు గురై పని చేయడం లేదు. కొంతకాలంగా కురిసిన వర్షాలతో ఫౌంటెయిన్ల నిండా నీరు చేరింది. నీరు బయటకు వెళ్లే అవకాశం లేకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. నీటిని చిమ్మే పైపు లైన్‌తోపాటు విద్యుత్ వైర్లు దెబ్బతినడంతో ఫౌంటెయిన్లు నిరుపయోగంగా మారాయి.

తెగులుతో రైతన్న దిగులు

- ఎర్రబారుతున్న పత్తి మొక్కలు
- కన్నీరు పెడుతున్న అన్నదాతలు



తెగులుతో ఎర్రబారుతున్న పత్తి చేను

కొత్తగూడ: ఎన్నో ఆశలతో పత్తి సాగు చేసిన రైతు కన్నీరు కారుతోంది. విల్ట్ తెగుళ్లతో విలవిల లాడుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో మొక్కజొన్న దిగుబడి తగ్గుతుందని చాలా మంది రైతులు పత్తి సాగు చేశారు. మండలంలో మొత్తం 2,221 ఎకరాల్లో పత్తి సాగు చేసినట్లు వ్యవసాయాధికారుల అంచనా. పత్తి ఏపుగా వస్తుండటంతో కలుపు మందు, భూమిలో ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేశారు. ఈఏడాది అప్పులు తీరుతాయని సంతోషిస్తున్న క్రమంలో మొక్కలు ఒక్కొక్కటి ఎర్రబడటంతో పోషకాల లోపం అనుకున్నారు. రెండు రోజుల్లో చేను మొత్తం వ్యాపించి రైతును నిండా ముంచింది. రైతుల ఆశలు అడియాశలు అయ్యాయి. నిలువెత్తు చేను కళ్లముందే ఎండిపోతుండటంతో రైతులు కన్నీరు పెడుతున్నారు. కొత్తపల్లి, పొగుళ్లపల్లి, దుర్గారం గ్రామాల్లో తెగుళ్ల ప్రభావం ఎక్కువ ఉన్నట్లు రైతులు తెలిపారు.

ఫ్యుజేరియం విల్ట్ వైరస్

భూమిలో ఉండే ఫ్యుజేరియం విల్ట్ వైరస్ ద్వారా వ్యాపించే తెగుళ్లు. ఈ తెగుళ్లు వ్యాపించడం వల్ల మొక్క వేరు వ్యవస్థ దెబ్బతిని మురిగిపోతాయి. చెట్టు ఎర్రబడే సరికే మొదటి వేరు వ్యవస్థ పూర్తిగా దెబ్బతింటుంది. రైతులు చేను ఎర్ర బారుతుందని యూరియా వేస్తారు. దీంతో తెగుళ్ల ఉధృతి ఇంకా పెరుగుతుంది.

ప్రారంభ దశలో అరికట్టవచ్చు

విల్ట్ తెగుళ్లు వచ్చినట్లు ప్రారంభ దశలో గుర్తిస్తే మిగతా చేను వ్యాపించకుండా అరికట్టచ్చు. కాపర్ ఆక్సిక్లోరైడ్ లేదా కాపర్ హైడ్రాక్సైడ్ మందును లీటర్ నీటి 4గ్రాములు కలిపి చెట్టు మొదళ్లల్లో వేళ్లు తడిసే విధంగా పోయాలి. ఇలా చేస్తే వైరస్ ఒక చెట్టు నుంచి మరో చెట్టు వ్యాపించకుండా ఉంటుంది.

- ఉదయ్, మండల వ్యవసాయాధికారి

మూడెకరాల పత్తి సాగు చేశా..



వర్షాకాలం మొక్కజొన్న దిగుబడి రావడం లేదని మూడు ఎకరాల్లో పత్తి సాగు చేశా. ఎంతో బాగా ఎదిగింది. పూత, కాత వచ్చే దశలో ఎర్రబారడం ప్రారంభమైంది. యూరియా సమయానికి వేయక పోవడం వల్ల అనుకున్నా. సుమారు లక్ష రూపాయల పైబడి పెట్టుబడి అయింది. అప్పులు ఎలా తీర్చాలో తెలియడం లేదు.

- కామ, రైతు, కొత్తపల్లి

రుణాలను సకాలంలో చెల్లించాలి



మాట్లాడుతున్న చైర్మన్ లింగారెడ్డి

గూడూరు: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఎల్‌టీ రుణాలు తీసుకున్న సభ్యులు తిరిగి తొందరగా చెల్లించాలని పీఏసీఎస్ చైర్మన్ చల్ల లింగారెడ్డి అన్నారు. పీఏసీఎస్ కార్యాలయంలో శనివారం మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం పరిపాలన నివేదికను ఆమోదించి, ఆడిట్ రిపోర్ట్ ఆమోదించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ.. పీఏసీఎస్ ద్వారా మండల రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా యూరియా సరఫరా చేస్తున్నామన్నారు. ఎలాంటి కొరత లేదని, కానీ కొంతమంది కృత్రిమ కొరత సృష్టిస్తుండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సంఘంలో మొత్తం 8,405 మంది సభ్యులు ఉన్నారని, 1,447 మంది సంఘం నుంచి అప్పు తీసుకున్నారని తెలిపారు. రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు వేం శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు యాకూపాష, నలమాస యాకయ్యగౌడ్, తవ్వల జయపాల్, డొనికి యాకాంబ్రం, రైతులు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళి



మహబూబాబాద్ రూరల్: నివాళులర్పిస్తున్న పోలీసు అధికారులు



మహబూబాబాద్: నివాళులర్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్



కొత్తగూడలో..



తొర్రూరులో..

తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణకు ఆయన సేవలను కొనియాడారు.

- సాక్షి నెట్‌వర్క్

ఎంపీటీసీ స్థానాన్ని యథావిధిగా ఉంచాలి



రహదారిపై రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు

కురవి: 'మా ఎంపీటీసీ మాకే కావాలని' సీరోలు మండలం చింతపల్లి గ్రామస్తులు శనివారం 365జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ వైస్ ఎంపీపీ దొంగలి నర్సయ్య, మాజీ సర్పంచ్ జెరిపోతుల రంగన్నగౌడ్ మాట్లాడుతూ.. చింతపల్లి గ్రామాన్ని సీరోలు మండలంలో కలిపారని, ఇంతకు ముందు కురవి మండలంలో ఉన్నప్పుడు చింతపల్లి ఎంపీటీసీ స్థానంగా ఉండేదని వివరించారు. సీరోలు మండలంలో కలిపాక 2వేల జనాభా కలిగిన చింతపల్లిని ఎంపీటీసీగా తీసివేసి 7వేల జనాభా కలిగిన సీరోలు ఎంపీటీసీ స్థానంలో కలపడం అన్యాయమని తెలిపారు. కలెక్టర్ స్పందించి చింతపల్లి ఎంపీటీసీ స్థానాన్ని యథావిధిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మామిండ్ల వెంకన్న, జానీ, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

లంబాడీలు ఐక్యంగా ఉద్యమించాలి

మరిపెడ రూరల్: లంబాడీల రిజర్వేషన్ పరిరక్షణ కోసం లంబాడీలు ఐక్యంగా ఉద్యమించాలని లంబాడీల జేఏసీ జిల్లా కన్వీనర్ బానోతు రమేష్ నాయక్ పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని దంటకుంటతండాలో నేడు ఆదివారం జిల్లా కేంద్రంలో జరిగే లంబాడీల ఆత్మగౌరవ సభ, ర్యాలీకి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు మాజీ సర్పంచ్ నర్సింగ్, జెమిని, నరేష్, హరి పాల్గొన్నారు.

రైల్వే సమస్యలు పరిష్కరించాలని వినతి

డోర్నకల్: ఎంపీ పోరిక బలరాంనాయక్ సహకారంతో జిల్లాలోని రైల్వే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని డీఆర్‌యూసీసీ సభ్యుడు జె.లచ్చిరాంనాయక్ తెలిపారు. స్థానిక రైల్వేస్టేషన్ ప్రాంగణంలో శనివారం రైలు ప్రయాణికులు, కూలీలు, స్థానికులు పలు రైళ్లకు హాల్టు కల్పించాలని కోరుతూ లచ్చిరాంనాయక్‌కు వినతిపత్రం అందించారు.

పేదలకు ఇళ్లు అందించాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

తొర్రూరు: గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను నిరుపేదలకు అందించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఆర్డీఓ ఆఫీస్ ఎదుట ఆందోళన కార్యక్రమాన్ని శనివారం చేపట్టి, వినతిపత్రాన్ని అందించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. కోట్లాది నిధులను వెచ్చించి డబుల్‌బెడ్రూం ఇళ్లను నిర్మించి రెండేళ్లు గడుస్తున్న ప్రభుత్వం పేదలకు పంపిణీ చేయకపోవడంతో నిరుపయోగంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గునిగంటి రాజన్న, బొల్లం అశోక్, సోమిరెడ్డి, దర్గయ్య, సాంబయ్య, యాకయ్య, శ్రీను, వెంకటేశ్వర్లు, సోమయ్య, జితేందర్, యాకయ్య, అమీర్, మమత, తదితరులు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడి గల్లంతు



మున్నేరువాగు వద్ద విచారణ చేస్తున్న పోలీసులు

డోర్నకల్: డోర్నకల్‌కు చెందిన మత్స్యకారుడు మున్నేరువాగులో చేపల వేటకు వెళ్లి అదృశ్యమయ్యాడు. ఎస్సై గడ్డం ఉమ శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక అంబేడ్కర్‌నగర్‌కు చెందిన బందెల వెంకటేశ్వర్లు(43) ఈనెల 25వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో పట్టణ సమీపంలోని మున్నేరువాగులో చేపల వేటకు వెళ్లాడు. 26వ తేదీ సాయంత్రం వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు మున్నేరువాగు వద్దకు వెళ్లి వెతికారు. వాగు వద్ద వెంకటేశ్వర్లుకు చెందిన సైకిల్‌తోపాటు దుస్తులు, టిఫిన్ బాక్సు, ఓ సంచి కనిపించింది. దీంతో వెంకటేశ్వర్లు భార్య విజయ రాత్రి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. శనివారం ఎస్సై గడ్డం ఉమ సిబ్బందితో వాగు వద్దకు వెళ్లి పరిసరాల్లో ఆచూకీ కోసం వెతికారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రిజర్వేషన్లు రాజ్యాంగం కల్పించిన హక్కు

- మాజీ మంత్రి సత్యవతిరాథోడ్



మాట్లాడతున్న సత్యవతిరాథోడ్

కురవి: లంబాడీలకు వచ్చిన రిజర్వేషన్లు రాజ్యాంగం కల్పించిన హక్కు అని మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. శనివారం మండలంలోని పెద్ద తండాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మానుకోటలో నేడు జరిగే ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. లంబాడీల ఆత్మగౌరవానికి సంబంధించిన విషయమని, ఎవరికి వ్యతిరేకంగా కాదని తెలిపారు. కొంత మంది కావాలనే చెడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. రిజర్వేషన్ తొలగించాలని గతంలో హైకోర్టుకు వెళ్తే మా పరిధి కాదని తేల్చిందని గుర్తు చేశారు. రాజ్యాంగం కల్పించిన హక్కు, ఆత్మగౌరవానికి సంబంధించిన విషయమని తెలిపారు. లంబాడీలు ఐకమత్యంతో ఉండి విజయవంతం చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో గుగులోత్ శ్రీరాంనాయక్, రాందాస్ నాయక్, సిరినాయక్, బిచ్చు, లక్ష్మణ్ నాయక్ పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ



మహబూబాబాద్ అర్బన్: డీఈఓ కార్యాలయంలో బతుకమ్మ వేడుకలు



గూడూరు: సీహెచ్‌సీలో బతుకమ్మ వేడుకలో పాల్గొన్న డీసీహెచ్‌ఎస్ రమేశ్

తెలంగాణ సంస్కృతికి పతీక అయిన బతుకమ్మ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. బతకమ్మలు పేర్చి కోలాటాలు ఆడారు. అనంతరం బతకమ్మల నిమజ్జనం చేశార.

- సాక్షి నెట్‌వర్క్

లయన్స్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

తొర్రూరు: లయన్స్ క్లబ్ సేవ కార్యక్రమాలను నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ రాంనర్సయ్య అన్నారు. శనివారం డివిజన్ కేంద్రంలోని నితిన్ ఫౌండేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముడుపు రవీందర్ రెడ్డి కుమారుడు బాపురెడ్డి, కుమార్తె మహాలక్ష్మి జన్మదినాన్ని పురస్కరించుకొని పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు, నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు డాక్టర్ రాజేందర్‌రెడ్డి, డాక్టర్ కిరణ్‌కుమార్, దామెర సరేష్, ముడుపు రవీందర్‌రెడ్డి, వజినపల్లి శ్రీనివాస్, బొనగిరి శంకర్, నగేష్, తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలకు సన్నద్ధం కావాలి



మాట్లాడుతున్న అందె మంగవిజయ్

గార్ల: మనువాదం, కులహత్యలకు వ్యతిరేకంగా మహిళలు సమరశీల పోరాటాలకు నడుం బిగించాలని ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మంగవిజయ్ పిలుపునిచ్చారు. గార్లలోని అంబేడ్కర్ భవనంలో జరిగిన పీఓడబ్ల్యూ జిల్లా సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని కాలరాసి నేడు మనువాదాన్ని తీసుకరావడం కోసం ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో నడిచే బీజేపీ ప్రభుత్వం కుటిల యత్నానికి పాల్పడుతుందన్నారు. దేశంలో మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రధాని నరేంద్రమోదీ విఫలమయ్యారని ఆరోపించారు. సంఘం జిల్లా అధ్యక్షురాలు తిరుపతమ్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి పూశె పద్మ, జడ ఐలమ్మ, అనురాధ, కవిత, శారద, రమ, మారుతి, సైదమ్మ, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వర్షంతో వీధులు జలమయం



కురవి: మండల వ్యాప్తంగా శనివారం భారీ వర్షం కురిసింది. కుండపోతవర్షం కురియడంతో మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న కాలనీతోపాటు ప్రధాన రహదారి జలమయమైంది. రోడ్డుపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

ఘనంగా భగత్‌సింగ్ జయంతి

మరిపెడ: షాహిద్ భగత్‌సింగ్ జయంతి మరిపెడలోని ప్రజాసంఘాల భవనంలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కోట శ్రీకాంత్‌రెడ్డి, వ్యవసాయకార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బానాల రాజన్న, పాగిండ్ల శ్రీను, పొడుపుగంటి వంశ పాల్గొన్నారు.

పరామర్శ..

డోర్నకల్: డోర్నకల్‌లో ఇటీవల మృతి చెందిన పోటు వరమ్మ, గండి వెంకమ్మ కుటుంబాలను శనివారం మాజీ మంత్రి సత్యావతిరాథోడ్, మాజీ ఎంపీ మాలోత్ కవిత పరామర్శించారు.

తప్పని యూరియా కష్టాలు

దంతాలపల్లి: తమ పంటను కాపాడుకునేందుకు అన్నదాతలు వర్షాలను సైతం లెక్కచేయకుండా వర్షంలో యూరియా కోసం లైన్లు కడుతున్నారు. రెండురోజుల తర్వాత మండలంలోని పెద్దముప్పారం, మండల కేంద్రంలోని రైతు కేంద్రాల వద్దకు శనివారం యురియా వచ్చింది. విషయం తెలుసుకున్న అన్నదాతలు వర్షాలను లెక్కచేయకుండా యురియా కూపన్లు తీసుకుని యూరియా బస్తాలు తీసుకెళ్లారు.

పొంగుతున్న మున్నేరువాగు



డోర్నకల్: భారీ వర్షాలతో మున్నేరు, ఆకేరువాగులు పొంగుతున్నాయి. డోర్నకల్ సమీపంలోని మున్నేరువాగుకు వరద పోటెత్తుంది. డోర్నకల్ పెద్ద చెరువుతో పాటు పలు గ్రామాల్లో చెరువులు అలుగు పోస్తున్నాయి.

తులసినారాయణడిగా స్వామివారు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ పట్టణంలోని శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవాలయంలో కొలువై ఉన్న శ్రీవేంకటేశ్వర స్వామివారిని పూర్తిగా తులసిమాలలతో అలంకరించడంతో శ్రీవారు తులసినారాయణడిగా భక్తులకు దర్శనమిచ్చారు.

దుర్గామాత ఊరేగింపు

డోర్నకల్: పట్టణంలోని ప్రధాన వీధుల్లో దుర్గామాత ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. ముత్యాలమ్మ గుడిలో ప్రతిష్ఠించిన దుర్గామాత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు.

కోతుల దాడిలో మొక్కజొన్న ధ్వంసం

మహబూబాబాద్ రూరల్: మండలంలోని దామ్యతండా జీపీ పరిధిలోని తోకబోడుతండాకు చెందిన రైతు నూనావత్ సురేష్ రెండు ఎకరాల వ్యవసాయ భూమిలో మొక్కజొన్న సాగు చేశాడు. శనివారం కోతుల దాడిలో మొక్కజొన్న కంకులు ధ్వంసమైపోయి బాధిత రైతుకు రూ.50వేల మేరకు నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశాడు.

బాలాత్రిపురసుందరి దేవిగా అమ్మవారు



గూడూరు: దుర్గాదేవి పూజలో పాల్గొన్న భక్తులు



మరిపెడలో..

దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గాదేవి శనివారం బాలాతిపుర సుందరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు.

- సాక్షి నెట్‌వర్క్

స్థానిక ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరాలి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న నాయకులు

గూడూరు: స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలో బీజేపీ జెండా ఎగరేసి, అభ్యర్థులను గెలిపించుకోవాలని జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీపీ చెల్పూరు వెంకన్న అన్నారు. మండల కేంద్రంలో శనివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా అయోధ్యపురానికి చెందిన గంధసిరి దిలీప్, కోల ముక్తీశ్వర్‌లతోపాటు మరికొంతమంది యువకులు గ్రామనాయకులు ముత్యం సురేష్, సాయి ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. వారికి మండల పార్టీ అధ్యక్షుడు రాసమల్ల వెంకన్న కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు మేరెడ్డి సురేందర్, రాంబాబు, అనిల్, రవి, దేవేందర్ పాల్గొన్నారు.